కూల్చివేతలపై అఖిల పక్షం ఏర్పాటు చేయాలి 8

హోటళ్లు, రెస్టారెంట్లలో సీసీ కెమెరాలు తప్పనిసరి
● జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆదేశాలు



సంప్రదాయం వెనుక విజ్ఞానం

తెలంగాణలో ప్రతీ సంప్రదాయం వెనుక విజ్ఞానం దాగి ఉన్నదని గిరిజన శాఖ మంత్రి సీతక్క అన్నారు. శనివారం ఓయూలో ఉద్యోగ సంఘాలు నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాలకు మంత్రి హాజరై కాసేపు ఆడిపాడారు.



సీపీ రాకతో హ్యాపీ

పేట్లబురుజులోని సిటీ పోలీస్ కార్ హెడ్‌క్వార్టర్స్‌లో బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. సీపీ సీవీ ఆనంద్ దంపతులు హాజరై ఉత్సవాలను ప్రారంభించి బతుకమ్మ ఆడారు. సీపీ హాజరవ్వడం ఉద్యోగుల్లో ఆనందం నింపింది.

బుల్డోజర్ రాకముందే

దందా బంద్



- ముందే సర్దుకుంటున్న అక్రమార్కులు
- స్వచ్ఛందంగా పరికరాలు, సామగ్రి తరలింపు
- మూసీ వెంట ఖాళీ అవుతున్న గోదాములు
- ఆర్‌బీ ఎక్స్ మార్కింగ్‌తో మొదలైన భయం
- ధ్వంసం కాకముందే నిర్వాహకుల అప్రమత్తం

మూసారాంబాగ్ వద్ద గోదాములో సామాన్లను సర్దుకుంటున్న దృశ్యం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మూసీ పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రారంభించిన హైడ్రా కూల్చివేతలు అక్రమార్కుల్లో వణుకు పుట్టిస్తున్నాయి. బుల్డోజర్ రాకముందే ఆక్రమిత స్థలాలు, గోదాములు, షెడ్లను ఖాళీ చేస్తున్నారు. రివర్‌బెడ్ (ఆర్‌బీ ఎక్స్) మార్కింగ్ చేసిన భవనాల్లో పరికరాలు, సామగ్రిని స్వచ్ఛందంగా తరలిస్తున్నారు. ధ్వంసం కాకముందే నిర్వాహకులు వేగంగా సర్దుకుంటున్నారు. మట్టిపోసి ఇన్నాళ్లు ఆయా స్థలాలను తమ ఆధీనంలో ఉంచుకొని లీజు పేరుతో ఆదాయం పొందుతున్న అక్రమార్కుల దందాకు క్రమేణా తెరపడుతున్నది. ఏ క్షణమైనా బుల్డోజర్ రావచ్చుననే భయం ఆక్రమణదారులకు పట్టుకుంది. లీజుకు తీసుకున్న స్థలాల్లో లక్షలు వెచ్చించి ప్రముఖ ఆటోమోబైల్ సంస్థల డీలర్లు సర్వీసింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఎంతో ఆధునీకరించిన సర్వీసు సెంటర్లపై బుల్డోజర్ వస్తే ఏమి మిగలదని భావించి ముందే ఖాళీ చేస్తున్నారు. మూసారాంబాగ్ బ్రిడ్జి దాటగానే దిల్‌సుఖ్‌నగర్ వైపు మార్గంలో మొదటి ఎడమ భాగంలో షెడ్లన్నీ ఖాళీ అవుతున్నాయి. చైతన్యపురి ఫణిగిరికాలనీలో బాక్స్ క్రికెట్ స్టేడియాన్ని కూడా పూర్తిగా తొలగించారు. అక్కడ ఎలాంటి ఆనవాళ్లు లేకుండా జాగ్రత్త పడుతున్నారు.

ఇష్టానుసారంగా పూడ్చివేత

హైదరాబాద్‌కు మూసీ మణిహారం లాంటిది. దీని వెంట చిన్న స్థలం దొరికినా నివాసానికి, వాణిజ్యానికి యథేచ్ఛగా వాడుకుంటున్నారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో లేఅవుట్లను అభివృద్ధి చేసిన కొందరు వ్యక్తులే ఆక్రమణలకు ఆజ్యం పోశారు. ఆ ప్రాంతంపై పట్టుండడంతో రోజుకింత నిర్మాణ వ్యర్థాలను పారపోస్తూ క్రమంగా మూసీని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో భవన నిర్మాణ వ్యర్థాలను చాలావరకు మూసీకే తరలించారు. డంపింగ్ చేసేందుకు నగరంలో ఎక్కడా చోటులేదంటూ రాత్రి సమయాల్లో ఇష్టానుసారంగా వ్యర్థాలను డంప్ చేశారు.

స్థలం మాదే.. పరిహారమివ్వండి

మూసీని ఆక్రమించిన వారు ఆ స్థలం తమదేనని, కొన్నేళ్లుగా ఉంటున్నామని చెప్పి ప్రభుత్వం నుంచి లబ్ధి పొందాలని భావిస్తున్నారు. తమ స్థలాల వద్ద కాపలా ఉంటూ రివర్‌బెడ్ మార్కింగ్ చేయడానికి వచ్చిన అధికారులకు స్థలం తమదేనని చెబుతున్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కాకుండా పరిహారం కావాలని కోరుతున్నారు.

మట్టిపోసి వాణిజ్య సముదాయాలు

మూసీ వెంట మట్టిని పోసి చదును చేసి స్థలాలుగా మార్చారు. ఆయా స్థలాలను వాణిజ్య, వ్యాపారాలకు లీజుకు ఇచ్చారు. అడ్వాన్స్‌గా లక్షల రూపాయలు తీసుకోవడంతోపాటు ప్రతినెలా ఆదాయం పొందుతున్నారు. ప్రధానంగా మూసీ వెంట మూసారాంబాగ్ బ్రిడ్జి సమీపంలో భారీగా షెడ్లు వెలిశాయి. అందులో ప్రముఖ ఆటోమోబైల్ కంపెనీలు సర్వీసు సెంటర్లను ఏర్పాటు చేశాయి. చైతన్యపురి ఫణిగిరికాలనీ సమీపంలో ఓ వ్యక్తి ఏకంగా క్రికెట్ బాక్స్ మినీ స్టేడియాన్ని ఏర్పాటు చేసి ప్రతినెలా లక్షల ఆదాయం పొందుతున్నాడు. ఎంజీబీఎస్ మెట్రోస్టేషన్‌కు సమీపంలో మూసీలో ప్రైవేటు బస్సుల పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఉస్మానియా ఆస్పత్రి గేటు ఎదురుగా ఏకంగా మూసీలోనే పార్కింగ్ దందా సాగుతోంది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోని మూసీ రివర్‌బెడ్‌లో దాదాపు 2వేల వరకు షెడ్లు, గోదాములు, వ్యాపారాలకు సంబంధించిన సముదాయాలు ఉన్నాయి.

సున్నంచెరువుకు మహర్దశ

- ఆక్రమణలను తొలగించిన హైడ్రా
- మురుగునీటి మళ్లింపునకు ప్రత్యేక చర్యలు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వార్తల్లో నిలిచిన మాదాపూర్ సున్నం చెరువుకు మహర్దశ పట్టనుంది. ఇప్పటికే చెరువులోని ఆక్రమణలను హైడ్రా తొలగించగా.. వాటర్ బోర్డు అధికారులు నీటిశుద్ధిపై దృష్టి సారించారు. వాటర్ బోర్డు చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సున్నం చెరువు అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం చెరువు ఎగువ ప్రాంతమైన పర్వతనగర్‌లో వాటర్ బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి పర్యటించారు. పర్వతనగర్ చౌరస్తాలో ప్రతిరోజూ ఉదయం మురుగు సమస్య తలెత్తుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజూ ఒక ఎయిర్‌టెక్ మెషీన్‌తో మురుగు సమస్యను పరిష్కరించడం, ట్రాఫిక్ మళ్లింపు కోసం ఓ కానిస్టేబుల్ విధులు నిర్వర్తించడం నిత్యకృత్యంగా మారింది. ఈ ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు రెండు

మిగతా 8వ పేజీలో..

చైతన్యపురి ఫణిగిరికాలనీలో ఖాళీ అయిన క్రికెట్ బాక్స్ స్టేడియం





అక్కడ కర్ర సాయంతోనే వెలుగులు విరజిమ్ముతాయి. ప్రమాదమని తెలిసినా స్తంభాలు ఏర్పాటు చేయరు. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని లక్ష్మీనరసింహనగర్‌లో దుస్థితి ఇది. ఇప్పటికీ ఒక్కనాలా లేదు. సీసీ రోడ్డు మచ్చుకు కూడా కనిపించదు. పాములు ఎదురుపడని రోజంటూ ఉండదు.

-జవహర్‌నగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి)

కరోనాను జయించిన 'టిమ్స్' కనుమరుగు



- కొవిడ్ చికిత్స అందించేందుకు 2020లో ఏర్పాటు
- ఇతర వైద్య సేవలపై దృష్టిపెట్టని గత ప్రభుత్వం
- కరోనా అనంతరం నిలిచిపోయిన వైద్య సేవలు
- తిరిగి స్పోర్ట్స్ అథారిటీకి అప్పగించేందుకు చర్యలు ముమ్మరం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో వైద్య సేవలు అందించేందుకు గచ్చిబౌలిలో ఏర్పాటు చేసిన టిమ్స్ ఆస్పత్రి మూన్నాళ్ల ముచ్చటగా మారింది. గచ్చిబౌలి స్టేడియంలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాల్సిందిగా సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. దీంతో మళ్లీ అక్కడ స్పోర్ట్ అథారిటీ కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇక్కడ కరోనా బాధితులకు చికిత్సలు తప్ప పూర్తి స్థాయిలో అన్ని విభాగాల వైద్య సేవలు అందించే విధంగా ఏర్పాటు చేయకపోవడంతో రోగులకు మెరుగైన చికిత్సలు అందించలేకపోయారు. కొవిడ్ రోగుల ప్రాణాల మీదకు వస్తే స్పెషాల్టీ విభాగాలకు చెందిన వైద్యులు లేకపోవడంతో వారిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మెడికల్ ఆఫీసర్ స్థాయి వైద్యులు మాత్రమే ఉండడం, ఇతర విభాగాలకు చెందిన వైద్యులు అందుబాటులో లేకపోవడంతో రోగులు రావడం తగ్గిపోయారు. కేవలం జలుబు, దగ్గు వంటి వాటికి మాత్రమే వైద్యం అందిస్తుండటంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయికి చేరుకుంది టిమ్స్ పరిస్థితి. దీంతో దీనిని ఆరోగ్యశాఖ నుంచి మళ్లీ స్పోర్ట్స్ అథారిటీకి బదిలీ చేయనున్నారు.

యుద్ధ ప్రాతిపదికన సౌకర్యాలు

బీఆర్ఎస్ ప్రభుత్వం కొవిడ్ మొదటి వేవ్‌లో అత్యవసర వైద్య సేవలు అందించడానికి యుద్ధ ప్రాతిపదికన వైద్య సిబ్బంది, ఆధునిక వైద్య పరికరాలను ఏర్పాటు చేసి 2020 ఏప్రిల్ 20న టిమ్స్‌ను ప్రారంభించింది. 3వ అంతస్తులో 1500 పడకలు, ఐసీయూలో 50 పడకలు ఏర్పాటు చేశారు. ప్రత్యేక వార్డులు, వైద్య పరికరాలు, వెంటిలేటర్ సదుపాయాలు కల్పించారు. కాంట్రాక్ట్ పద్ధతిలో మెడికల్ ఆఫీసర్లు, ప్రొఫెసర్లు, నర్సులు, ఇతర సిబ్బందిని నియమించారు. కరోనా రెండో వేవ్‌లోనూ ఈ ఆస్పత్రిలో వైద్య సేవలందించారు.

దృష్టి సారించని అప్పటి ప్రభుత్వం

నగరానికి నలువైపులా మల్టీ సూపర్‌స్పెషాల్టీ ఆస్పత్రులను నిర్మిస్తున్నామని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా అల్వాల్, ఎర్రగడ్డ, కొత్తపేట సూపర్‌స్పెషాల్టీ ఆస్పత్రులకు భూమిపూజ చేసి నిర్మాణ పనులు చేపట్టినప్పటికీ టిమ్స్‌పై దృష్టి సారించలేదు. దీంతో రెండేళ్ల నుంచి ఇక్కడ వైద్య సేవలు దాదాపుగా నిలిచిపోయాయి. క్రమేణా ఇక్కడి వైద్యులు, నర్సులు, సిబ్బందిని నిలోఫర్, గాంధీ, ఉస్మానియా, చెస్ట్, సుల్తాన్‌బజార్‌లోని ప్రసూతి ఆస్పత్రులకు తరలించారు.

3 నెలలుగా జీతాల్లేవ్..

- 'గాంధీ'లో అవుట్ సోర్సింగ్ సిబ్బంది యాతన



అడ్డగుట్ట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న 207 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బందికి మూడునెలలుగా వేతనాలు అందడం లేదు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బంది జీతాల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. వేతనాలివ్వాల్సిన కాంట్రాక్టర్లు.. ఇచ్చే వరకు ఓపిక పట్టాలని, లేదంటే ఉద్యోగం నుంచి వెళ్లిపోండంటూ హుకుం జారీ చేస్తున్నట్లు తెలిసింది. జీతాల విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను అడగగా, తమకేం తెలియదని, కాంట్రాక్టర్లను అడగాలని సూచించారు. దసరా సమీపిస్తుండడంతో ఇప్పటికైనా జీతాలు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.

డీజేలపై సడలింపు ఇవ్వాలి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో డీజేలపై సడలింపు ఇవ్వాలని లష్కర్ జిల్లా సాధన సమితి సభ్యులు కోరారు. శనివారం వారు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. సమితి అధ్యక్షుడు పవన్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన బతుకమ్మ వేడుకల్లో ఆటపాటలు ఎంతో ముఖ్యమని గుర్తుచేశారు. తెలంగాణ పండుగలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి డీజే నిషేధం విషయంలో పునరాలోచించాలని ఆయన కోరారు.

కొత్త నేర చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- డీజీపీ జితేందర్

హైదరాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మూడు నెలల క్రితం కేంద్రం తీసుకొచ్చిన నూతన నేర చట్టాలపై పోలీసు అధికారులు అవగాహన పెంచుకోవాలని డీజీపీ జితేందర్ హితవుపలికారు. ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీసు అకాడమీలో శనివారం నూతన క్రిమినల్ చట్టాల అమలుపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. కొత్త చట్టాలు వచ్చి మూడు నెలలవుతోందని, క్షేత్రస్థాయిలో ఎదుర్కొన్న సానుకూల అంశాలు, ఆచరణలో ఇబ్బందులపై చర్చించేందుకు ఈ వర్క్‌షాప్ ఉపయోగపడుతుందన్నారు. తెలంగాణ పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాషా బిష్త్ మాట్లాడుతూ కొత్త చట్టాలు సంక్లిష్టంగా ఉన్నాయని, తగిన శిక్షణ లేకుండా అమలుచేయడం పెద్ద సవాల్ అన్నారు. క్షేత్రస్థాయిలో ఎదురైన సమస్యలు, వాటి పరిష్కారాలపై సీఐడీ డీజీ శిఖాగోయల్ వివరించారు.

పాఠశాల స్థాయిలోనే నైపుణ్య విద్యనందించాలి 8

మళ్లీ ఓటీఎస్



- నీటి బకాయిలపై వన్‌టైమ్ సెటిల్‌మెంట్
- ఆలస్య రుసుముతో పాటు వడ్డీ మాఫీ
- ఈనెల 1 నుంచి 31 వరకు అమలు
- పెండింగ్ బిల్లులన్నీ చెల్లిస్తేనే పథకం వర్తింపు
- సద్వినియోగం చేసుకోవాలన్న వాటర్‌బోర్డు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తాగునీటి బకాయిల చెల్లింపునకు వాటర్‌బోర్డు చక్కటి అవకాశం కల్పించింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలపై విధించిన ఆలస్య రుసుము, వడ్డీని మాఫీ చేస్తూ వన్‌టైం సెటిల్‌మెంట్ స్కీమ్(ఓటీఎస్)ను ప్రకటించింది. బకాయిలు పూర్తిగా చెల్లిస్తేనే ఈ పథకం వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఈ మేరకు పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ ఉత్తర్వులు జారీచేశారు. దసరా పురస్కరించుకొని ఈ పథకాన్ని అందుబాటులోకి తీసుకురాగా.. ఈనెల 1 నుంచి 31 వరకు అమల్లో ఉంటుందని పేర్కొన్నారు.

బకాయిలు తగ్గించేందుకు..

వాటర్‌బోర్డులో నీటి బకాయిలు అంతకంతకూ పెరిగిపోతుండటంతో వాటిని తగ్గించేందుకు ఓటీఎస్‌ను అమలు చేయాలని వాటర్‌బోర్డు గతనెల 19న ప్రభుత్వానికి లేఖ రాయగా, అందుకు అనుమతులిస్తూ తాజాగా ఉత్తర్వులు వెలువరించింది. ఓటీఎస్ కింద వినియోగదారులు తమ బకాయిలను ఎలాంటి ఆలస్య రుసుం, వడ్డీ లేకుండా చెల్లించవచ్చు. ఈ పథకాన్ని గతంలో 2016లో, మళ్లీ 2020లో అమలు చేశారు. ఒక్కో విడతలో రూ.400 కోట్లకుపైగా బకాయిలు వసూలయ్యాయి. అయితే నీటి బిల్లుల బకాయిలపై వడ్డీ మాఫీ కోసం అధికారుల స్థాయిని బట్టి పరిమితి నిర్ణయించారు. మేనేజర్ స్థాయిలో రూ.2000 వరకు, డిప్యూటీ జనరల్ మేనేజర్ స్థాయిలో రూ.2001 నుంచి రూ.10,000 వరకు, జనరల్ మేనేజర్ స్థాయిలో రూ.10,001 నుంచి రూ.1,00,000 వరకు, చీఫ్ జనరల్ మేనేజర్ స్థాయిలో రూ.1,00,001 నుంచి అంతకంటే ఎక్కువ మాఫీ చేసే అధికారం ఉంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి వినియోగదారులకు సూచించారు.

ఓటీఎస్ నిబంధనలు ఇలా

- ఓటీఎస్ ఈనెల 31 వరకు మాత్రమే అమల్లో ఉంటుంది.
- నల్లా కనెక్షన్ యాక్టివ్‌లో ఉన్నవారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది.
- గతంలో ఓటీఎస్‌ను వినియోగించుకోని వారు.. ఒకేసారి బిల్లు చెల్లిస్తే ఆలస్య రుసుము, వడ్డీ మాఫీ అవుతాయి.
- ఒకవేళ గతంలో ఓటీఎస్‌ను వినియోగించుకుంటే 50% మాఫీఅవుతుంది.
- ఈ పథకం కింద ప్రయోజనం పొందాలనుకునే వారు భవిష్యత్తులో 24 నెలలపాటు తప్పనిసరిగా క్రమంగా బిల్లులు చెల్లిస్తామని అఫిడవిట్ ఇవ్వాలి.



కొలన్ హన్మంత్‌రెడ్డిని సన్మానిస్తున్న స్థానికులు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా : కొలన్

గాజులరామారం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. గాజులరామారం డివిజన్ సుభాష్‌చంద్ర బోస్ నగర్‌లో స్థానికులు విజ్ఞప్తి మేరకు ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో రూ.15 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన శనివారం ప్రారంభించారు. చాలా రోజులుగా పెండింగ్ ఉన్న రోడ్డు సమస్యను పరిష్కరించడంతో ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డిని శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ నాయక్, సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, వెంకటేష్, బలరామ్, శ్రీనివాస్, షేక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



దత్తాత్రేయకాలనీలో సీసీరోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

దత్తాత్రేయ కాలనీలో సీసీ రోడ్డు పరిశీలన

హైదర్‌నగర్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ దత్తాత్రేయ కాలనీలో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీకాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. స్థానికంగా ఏ సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషిచేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో రామకృష్ణగౌడ్, శివరాజ్‌గౌడ్, పాండుగౌడ్, షౌకత్‌అలీమున్నా, అగ్రవాసు, శంకర్ గౌడ్, వాలి నాగేశ్వరరావు, మహేష్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల వెంబడి డబ్బాల తొలగింపు

గచ్చిబౌలి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో రోడ్ల పక్కన వెలసిన డబ్బాలను జీహెచ్ఎంసీ అధికారులు శనివారం తొలగించారు. కొండాపూర్, శ్రీరాంనగర్, సుదర్శన్‌నగర్‌లో రోడ్ల పక్కన డబ్బాలు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నాయని, ప్రజలు, వాహనదారుల నుంచి ఫిర్యాదులు రావడంతో వాటిని తొలగిస్తున్నట్లు తెలిపారు. జోనల్ కార్యాలయం ఎదురుగా ఉన్న సుదర్శన్‌నగర్, పాతముంబై రహదారిపై వెలిసిన పాన్‌డబ్బాలు, చికెన్ తదితర దుకాణాలను తొలగించారు. వారం రోజులుగా చిరు వ్యాపారులకు నోటీసులు జారీ చేసినా వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో తొలగిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు.

ఖానామెట్‌లోని ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి

గచ్చిబౌలి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి మండల పరిధిలోని ఖానామెట్ సర్వేనెంబర్ 41/14లోని ప్రభుత్వ భూమిని ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నాడని, కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని కాపాడాలని శేరిలింగంపల్లి సీపీఐ నాయకులు శేరిలింగంపల్లి కార్యదర్శి శోభన్, కృష్ణ, మాణిక్యం, వరుణ్ తహశీల్దార్ వెంకారెడ్డికి వినతిపత్రం శనివారం అందజేశారు. చాలాకాలంగా కబ్జాలు జరుగుతున్నాయని, తాము అధికారుల దృష్టికి తీసుకవస్తున్న మండల రెవెన్యూ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని వారు వినతిపత్రంలో ఆరోపించారు. అధికారులు ఇప్పటికైనా ఖానామేట్‌లోని ప్రభుత్వ భూమిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకుని కోట్లు విలువచేసే ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాలని, లేనిపక్షంలో మండల, కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు.

మూడో రోజు అన్నపూర్ణాదేవి

ఘనంగా అమ్మవారికి పూజలు



తారానగర్‌లో అమ్మవారి పూజల్లో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్

గచ్చిబౌలి, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. శేరిలింగంపల్లి శ్రీరామ్‌నగర్ బ్లాక్ సీ, తారానగర్‌లో అమ్మవారి మండపాల వద్ద శనివారం కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు వీరేశంగౌడ్, తారానగర్ దుర్గామాత ఉత్సవకమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

● అన్నపూర్ణాదేవి.. గాయత్రీదేవిగా..



భెల్ కాలనీలో అన్నపూర్ణాదేవి అవతారంతో పోచమ్మ తల్లి



గాయిత్రీదేవి అవతారంతో దర్శనమిచ్చిన దుర్గాదేవి

భెల్‌కాలనీ: బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని కనకదుర్గాదేవి ఆలయంలో వైభవంగా జరుగుతున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారిని గాయిత్రీదేవి అవతారంతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి విశేష వస్త్రాలంకరణ, పుష్పార్చన, చండీ సప్తశతి పారాయణం, చండీహోమం, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారి కళాప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాలలో నవచండీహోమం, సుహాసినీలచే పూజలను ఘనంగా నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. యోగేశ్వరస్వామి దేవాలయం, బ్రాహ్మణ సంక్షేమ భవనం, ఎంఐజికాలనీలో గల పోచమ్మ తల్లి ఆలయం, శ్రీ రామాలయం, కామాక్షి అమ్మవారి ఆలయాల్లో దుర్గాదేవి నవరాత్రి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.

● డీజే అసోసియేషన్ ఆధ్వర్యంలో..

గాజులరామారం: దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో తమకు మద్దతు ఇవ్వాలని దుర్గామాత పూజ నిర్వాహకులు డీజే అసోసియేషన్ సభ్యులు పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ ఉత్సవాల్లో సౌండ్ పొల్యూషన్ లేకుండా జరుపుకోవాలని వారికి తెలిపారు.



షాపూర్‌నగర్: గాజులరామారం డివిజన్, చిత్తారమ్మ దేవాలయంలో మూడో రోజు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చిన అమ్మవారు



కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాపులో కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం వద్ద నృత్యకళాకారులతో నిర్వాహకులు శేరి సతీష్‌రెడ్డి, మమత, రాజేష్ గౌడ్ తదితరులు

అమ్మవారి మండపాల్లో పూజలు

కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాపులో కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం వద్ద నృత్యకళాకారులతో నిర్వాహకులు శేరి సతీష్‌రెడ్డి, మమత, రాజేష్ గౌడ్ తదితరులు.

● మూసాపేట్ యంగ్ స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి పూజల్లో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్, తూము మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● జవహర్‌నగర్‌లో ఘనంగా శరన్నవరాత్రి పూజలు

ఫతేనగర్ డివిజన్ జవహర్‌నగర్ కాలనీలోని కనకదుర్గా కాళికాదేవి ఆలయంలో శర్నవరాత్రి పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ అర్చకులు దోర్భల కాశీనాథశర్మ పర్యవేక్షణలో శనివారం అమ్మవారిని గాయత్రిదేవి అలంకరణలో అలంకరించగా పెద్ద సంఖ్యలు మహిళలు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



జవహర్‌నగర్‌లో ఘనంగా శరన్నవరాత్రి పూజలు



● ఆంధ్రజ్యోతి ప్రింటింగ్ ప్రెస్‌లో

కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆంధ్రజ్యోతి ప్రింటింగ్ ప్రెస్ వద్ద శరన్నవరాత్రిలో భాగంగా శనివారం అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి, ఆంధ్రజ్యోతి ప్రకటనల విభాగం జీఎం శివప్రసాద్, డీజీఎం ఆర్.ఆర్. నాయుడు అమ్మవారికి ప్రత్యేక పూజలు పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో రామ్‌ప్రసాద్, అనిల్‌కుమార్, శేఖర్, రాజేశ్, విజయ్‌కృష్ణ, మహేశ్, రాజూ సింహాచలం పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శశికాంత్‌రెడ్డి

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు

భెల్‌కాలనీ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల విద్యార్థులు అవగాహన పెంచుకోవడంతో పాటు సెల్‌ఫోన్ వినియోగంలో తగుజాగ్రత్తలు పాటించాలని రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ శశికాంత్‌రెడ్డి సూచించారు. శనివారం భెల్ టౌన్‌షిప్‌లో గల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు 'డిజిటల్ వెల్‌నెస్- సైబర్ నేరాల'పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్ వినియోగంపై ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకోవాలని తెలిపారు. అపరిచిన నెంబర్లు, లింక్‌లు, యాప్‌లను పూర్తిగా కట్టడి చేయాలని వివరించారు. అతిగా సెల్‌ఫోన్ వాడకంతో దుష్ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవీందర్, డాక్టర్. జి.జగన్నాథ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

టీజీఎస్‌పీడీసీఎల్ ఆర్టీజన్‌కు గాయాలు

కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఆర్టిజన్‌కు గాయాలయ్యాయి. బాలాజీనగర్ సెక్షన్ పరిధిలో పని చేస్తున్న మహ్మద్ ఎలియాస్(40) కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద పబ్లిక్ ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు వేయడానికి ప్రయత్నించగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. సమాచారం అందుకున్న ఏఈ శంకర్ వెంటనే స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో జాయిన్ చేశారు. మొహంపై స్వల్ప గాయాలయ్యాయని, దీని ఖర్చుంతా టీజీఎస్‌పీడీసీఎల్ భరిస్తుందని అధికారి తెలిపారు. రెగ్యులర్‌గా పనిచేసే ఆర్టిజన్ అని, తన డ్యూటీలో భాగంగా ప్రమాదవశాతు జరిగిందని, ఎలియాస్‌కు చిన్నచిన్న గాయాలయ్యాయని తెలిపారు.

మంజీర రోడ్డు పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన

మియాపూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్ల నుంచి ప్రజలు పడుతున్న ఇబ్బందులు త్వరలో తొలగనున్నాయని, మంజీర రోడ్డుకు మహర్దశ వచ్చిందని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. శనివారం రూ.4 కోట్లా 31 లక్షలా 50 వేల నిధులతో మంజీర పైపులైను, సీసీ రోడ్డు పునరుద్ధరణ పనులకు ఆయన అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ మంజీర రోడ్డు సమస్యకు నేటితో పరిష్కారం లభించిందన్నారు. నాడు రూ.40 కోట్లతో మంజీర మంచినీటి పైపులైను పునరుద్ధరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపకమిషనర్ మోహన్ రెడ్డి, కార్పొరేటర్లు పూజిత, జగదీశ్వర్‌గౌడ్, జీహెచ్ఎంసీ అధికారులు. కాలనీవాసులు పాల్గొన్నారు.


మంజీర రోడ్డు పునరుద్ధరణ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు జగదీశ్వర్‌గౌడ్, పూజిత, డీసీ మోహన్‌రెడ్డి

లిఫ్ట్ పనులకు శంకుస్థాపన

చందానగర్: చందానగర్ సర్కిల్ కార్యాలయంలో లిఫ్ట్ నిర్మాణ పనులకు ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యాలయంలో లిఫ్ట్ లేకపోవడంతో రెండు, మూడు అంతస్తులు ఉన్న వివిధ విభాగాలకు మహిళలు, వృద్ధులు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారని, ప్రజల అవసరాలను గుర్తించి లిఫ్ట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు ఈఈ కేవీఎస్ రాజు, ఏఈ ప్రతాప్, నాయకులు రఘునాథ్‌రెడ్డి, అశోక్‌గౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, వినోద్‌రావు, కరుణాకర్‌గౌడ్, రాజుయాదవ్, బాలింగ్ గౌతంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● ఫౌండేషన్ సేవలు అభినందనీయం

హోప్ ఫౌండేషన్ సేవలు అభినందనీయని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. హుడాకాలనీలోని ఫౌండేషన్ కార్యాలయంలో ప్రతీ శనివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమం 100 రోజులు పూర్తి చేసుకుంది. దీంతో ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గాంధీ, డివిజన్ నాయకుడు రఘునాథ్‌రెడ్డి హాజరై భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో హోప్‌ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కొండ విజయ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కూల్చివేతలపై అఖిల పక్షం ఏర్పాటు చేయాలి

షాపూర్‌నగర్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): హైడ్రా కూల్చివేతల్లో ఇళ్లు కోల్పోతున్న వారి కోసం అఖిల పక్షం ఏర్పాటు చేసి, నష్టపోతున్న పేదల విషయం చర్చించాలని సామాజిక కార్యకర్త కోల రవీందర్ ముదిరాజ్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు వినతిపత్రం అందజేశారు. ఇత్తరి మారయ్య, శ్రీనివాస్ యాదవ్, బసవరాజుపాల్గొన్నారు.


ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న కోల రవీందర్‌ముదిరాజ్ తదితరులు

గీత కార్మికుల అభివృద్ధి కోసం కృషి

నిజాంపేట్: గత ప్రభుత్వ హయాంలో కల్లుగీత కార్మికుల అభివృద్ధికి ఎన్నో సంక్షే పథకాలు అమలు చేసి, వారి అభివృద్ధికి కృషి చేశారని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన 14 మంది గీత కార్మికుల ఎక్సైజ్‌శాఖ ద్వారా మంజూరైన కాటమయ్య కిట్లను ఎక్సైజ్ సీఐ యాదయ్యలతో కలిసి కార్మికులకు అందజేశారు. ఎస్ఐ రవిరాథోడ్, బీసీ కార్పొరేషన్ అధికారులు రాజేశ్వర్, మొహిద్‌ఖాన్, కమల్‌దాస్, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణగౌడ్, సురేష్ గౌడ్, బాలకృష్ణ, బాలరాజు పాల్గొన్నారు.

● మల్లంపేటకు చెందిన టి.వెంకటేశ్వర్లు, కొంపల్లి, దూలపల్లికి చెందిన లక్ష్మీ నారాయణలకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైనా ఎల్‌ఓసీ పత్రాలను అందజేశారు.

గీత కార్మికుల అభివృద్ధి కోసం కృషి చేసింది

నిజాంపేట్: బీఆర్ఎస్ ప్రభుత్వ ఆయాంలో గీత కార్మికుల ఎన్నో సంక్షే పథకాలు అమలు చేసి, వారి అభివృద్ధికి కృషి చేశారని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన 14 మంది గీత కార్మికుల ఎక్సైజ్‌శాఖ ద్వారా మంజూరైన కాటమయ్య కిట్లను ఎక్సైజ్ సీఐ యాదయ్యలతో కలిసి కార్మికులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కల్లు గీత కార్మికులు తప్పనిసరిగా భద్రతా చర్యలు పాటించాలని, దీని ద్వారా తాటి చెట్టు ఎక్కినప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రవిరాథోడ్, బీసీ కార్పొ రేషన్ అధికారులు రాజేశ్వర్, మోహీద్‌ఖాన్, కమల్ దాస్, శ్రీనివాస్‌గౌడ్,గౌడ సంక్షేమ సంఘ సభ్యులు కృష్ణగౌడ్, సురేష్‌గౌడ్, బాలకృష్ణ, బాలరాజు పాల్గొన్నారు. అనంతరం దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేటకు చెందిన టి. వెంకటేశ్వర్లు, కొంపల్లి, దూలపల్లికి చెందిన లక్ష్మీ నారాయణలకు సీఎం సహాయ నిధిక్రింద మంజూరైనా రూ. 1 లక్షా 10 వేలను, వెంకటే శ్వర్లు, రూ. 2 లక్షల 75 వేల ఎల్‌ఓసీ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. అలాగే నార్త్ సిటీ మెట్రో రైలు విస్తరించడంపై మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు నేడు సుచిత్రా, కొంపల్లి, మేడ్చల్, కార్ఖాన, తిరుమలగిరి,అల్వాల్, శామీర్‌పేటలో చేపడతున్న శాంతి యుత నిరసన కార్యాక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద్ మద్ద ఇవ్వాలని పేట్ బషీరాబాద్ క్యాంప్ కార్యాలయంలో మెట్రో సాధన సమితి సభ్యులు ఎమ్మెల్యేను కలిసి మద్దతు కోరారు.

హోటళ్లు, రెస్టారెంట్లలో సీసీ కెమెరాలు తప్పనిసరి

● జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆదేశాలు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్ల కిచెన్లు పరిశుభ్రంగా ఉండాలని, సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని హోటళ్లు, ఫుడ్‌కోర్టులు, రెస్టారెంట్లలో ఇటీవల జీహెచ్ఎంసీ ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు చేసిన నేపథ్యంలో చాలాచోట్ల ఫుడ్‌సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఎస్ఏఐ) మార్గదర్శకాలను పాటించడంలేదని తెలిసిందని కమిషనర్ తెలిపారు.

సున్నంచెరువుకు మహర్దశ

(5వ పేజీ తరువాయి)

కిలోమీటర్ల మేర సున్నంచెరువు వరకు ఉన్న మురుగు నీటి పైపులైన్‌ను తనిఖీ చేశారు. చెరువులోకి ఉన్న సీవరేజీ లైన్ ఔట్‌లెట్ ధ్వంసం కావడంతోనే మురుగునీటి ప్రవాహం సక్రమంగా లేదని గుర్తించారు.

కొత్త పైపు లైన్ల నిర్మాణం

సమస్య పరిష్కారానికి చెరువులోకి చేరే సివరేజీ పైపులైన్‌ను మళ్లించేందుకు అక్కడికక్కడే ప్రణాళికలు రూపొందించారు. పర్వతనగర్ సిగ్నల్ నుంచి రోడ్ నంబర్ 45 వరకు కొత్త పైపులైన్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. మురుగునీటిని సున్నం చెరువులోకి చేరకుండా మళ్లించి దుర్గం చెరువు ఎస్టీపీ ద్వారా శుద్ధి చేయనున్నారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వాటర్ బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి అధికారులకు సూచించారు. 90 రోజుల్లోనే ఈ పనులు పూర్తి చేస్తామని ఆయన వెల్లడించారు.

'కార్పొరేట్ జూనియర్ కాలేజీల అనుమతుల వివరాలివ్వండి'

హైదరాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని ఓ ప్రైవేటు జూనియర్ కాలేజీ (బాలికల ఐఐటీ క్యాంపస్), బాచుపల్లి మరో ప్రైవేటు జూనియర్ కాలేజీ (బాలికల ఐఐటీ క్యాంపస్)లకు సంబంధించి అనుమతులు, నిరభ్యంతర పత్రాల (ఎన్‌ఓసీ) పూర్తి వివరాలివ్వాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద సంబంధిత ప్రభుత్వ విభాగాలను ఆదేశించారు. ఇటీవల ఆ కాలేజీల్లో తాను చేపట్టిన తనిఖీల్లో భద్రత ఏర్పాట్లు సరిగా లేవని, పరిశుభ్రత పాటించడం లేదని, హాస్టళ్లు విద్యార్థినుల నివాస యోగ్యంగా లేవని గుర్తించినట్లు ఆమె తెలిపారు. దీంతో ఆ కాలేజీలకు జారీ చేసిన అనుమతులు, ఎన్‌ఓసీల వివరాలు ఇవ్వాలంటూ జీహెచ్ఎంసీ, ఫైర్, ఫుడ్ సేఫ్టీ విభాగాలు, ఇంటర్మీడియట్ బోర్డును ఆమె ఆదేశించారు. ఈ వివరాలు అందిన తర్వాత కమిషన్ లోతుగా సమీక్షిస్తుందని, ఆ తర్వాత అవసరమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.


సీబీజే గోల్డ్ అండ్ డైమండ్, శుభశ్రీ సిల్క్స్ షోరూంను ప్రారంభిస్తున్న సినీనటి నిధి అగర్వాల్

చందానగర్‌లో సీబీజే గోల్డ్ అండ్ డైమండ్, శుభశ్రీ సిల్క్స్ షోరూం

● ప్రారంభించిన సినీనటి నిధి అగర్వాల్

చందానగర్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): అందమైన మగువలకు ఆభరణాలు మరింత అందాన్ని ఇస్తాయని ప్రముఖ సినీనటి నిధి అగర్వాల్ అన్నారు. చందానగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సీబీజే గోల్డ్ అండ్ డైమండ్, శుభశ్రీ సిల్క్స్ షోరూంను నిధి అగర్వాల్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ షోరూంలో సరికొత్త డిజైన్లు అందుబాటులో ఉన్నాయని, ఇవి మగువల మనస్సు దోచుకుంటాయని అన్నారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ జాన సురేష్ మాట్లాడుతూ గోల్డ్ అండ్ డైమండ్, శుభశ్రీ సిల్క్స్ తెలుగు రాష్ట్రాల్లో వినియోగదారుల మన్ననలు పొందాయన్నారు. చందానగర్‌లో నూతన షోరూం ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా నిధి అగర్వాల్‌ను చూసేందుకు అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో షోరూం ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్దెల చెరువులో ప్రహరీ కూల్చివేత

దుండిగల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం దేవేందర్‌నగర్‌లో గల మద్దెల చెరువులో వెలిసిన అక్రమ ప్రహరీ, ఓ గదిని ఇరిగేషన్, కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు సిబ్బందితో కలిసి కూల్చివేశారు. ప్రభుత్వ సర్వే నంబరు 335లో 11.70 ఎకరాలాల్లో ఉన్న మద్దెల చెరువులో సుమారు 8ఎకరాల వరకు ధరణిలో పట్టా భూమిగా మార్చిన కబ్జాదారులు ప్రహరీతో పాటు ఒక గదిని నిర్మించారు. ఫిర్యాదు అందడంతో స్పందించిన అధికారులు సర్వే నిర్వహించి, ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు కూల్చివేతలు మొదలుపెట్టారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ బీజేపీ నాయకులు ఆకుల సతీష్ మాట్లాడుతూ చెరువు స్థలం ప్రైవేట్ వ్యక్తుల పేరు మీద ధరణిలో ఎలా ఎక్కింది?, సహకరించిన అధికారులు, దీని వెనుక ఉన్న ప్రజాప్రతినిధులపై కేసు నమోదు చేసి, చెరువులను కాపాడాలని కోరారు.


మద్దెల చెరువులో వెలిసిన ప్రహరీని కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు

పాఠశాల స్థాయిలోనే నైపుణ్య విద్యనందించాలి

జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ గోపీచంద్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు నైపుణ్య విద్యనందించాలని జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ అన్నారు. హైటెక్‌సిటీలో ఏర్పాటు చేసిన అలెన్ ఎడ్యుకేషన్ అకాడమీని శనివారం ఆయన లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ అలెన్ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాశిక్షణ సంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను ప్రారంభించడం శుభపరిణామన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, అక్షర విద్యాసంస్థల చైర్మన్ జగన్‌మోహన్ రావు మాట్లాడుతూ హైదరాబాద్‌లో అలెన్ - అక్షర విద్యా సంస్థలు కలిసి పనిచేయనున్నాయన్నారు. అలెన్ సంస్థల సీఈఓ నితిన్ కుక్రేజా మాట్లాడుతూ తొలిదశలో భాగంగా నగరంలో ఐదు క్యాంపస్‌లను ప్రారంభించనున్నామని, వచ్చే మూడేళ్లలో 20 వేల మంది విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ ఇవ్వడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో అర్జున అవార్డు గ్రహీత అనూప్‌యమ, సౌత్ ఇండియా హెడ్ మహేష్‌యాదవ్, అలెన్, అక్షర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


గోపీచంద్ అలెన్ ఎడ్యుకేషన్ అకాడమీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న గోపీచంద్, జగన్‌మోహన్‌రావు తదితరులు

బతుకమ్మ సంబురాలు


అంబేడ్కర్ వర్సిటీలో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న ప్రొఫెసర్లు, ఉద్యోగులు


ఓల్డ్‌బోయినపల్లి: ఓల్డ్‌బోయినపల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మాయాదవ్ నివాసంలో బతుకమ్మ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి ఈ వేడుకల్లో డివిజన్ బీఆర్ మహిళలు, స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ఆట పాటలతో హోరెత్తించారు.

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో బతుకమ్మ సంబురాలు శనివారం ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొ.ఇ.సుధారాణి, అకడమిక్ డైరెక్టర్ ప్రొ.గంటా పుష్పా చక్రపాణి, మహిళా విభాగ ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రొ.జి.మేరీ సునందలు ప్రారంభించారు. బతుకమ్మ వేడుకల్లో ప్రొ.పల్లవి కబ్డే, డా.రజని, డా.ఎ.రమాదేవి, మంజుల సులోచన, సుహాసిని, రుశేంద్ర మణి, కామాక్షి, విశ్వవిద్యాలయ మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో అన్ని విభాగాల మహిళా ఉద్యోగులు, అధిపతులు, డీన్స్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఉద్యోగ సంఘాల నాయకులు, మహేష్, కిషోర్ బాబు పాల్గొన్నారు.


హైదర్‌నగర్: బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ రోజాదేవి

బతుకమ్మ వేడుకల్లో కార్పొరేటర్

హైదర్‌నగర్: బతుకమ్మ పండుగ సందర్భంగా బీఆర్ఎస్ భవన్ లో జరిగిన బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్సీ వాణిదేవి, మాజీ ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్ రెడ్డి, సునీత, కార్పొరేటర్లతో కలిసి హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ రోజాదేవి పాల్గొన్నారు.


ఇంటి నుంచి బతుకమ్మతో వెళుతున్న మాజీ కార్పొరేటర్ గొట్టిముక్కల వెంగళ్‌రావు కుటుంబ సభ్యులు

దేశ సంస్కృతికి ఘనచరిత్ర ఉంది

భెల్‌కాలనీ: భెల్ టౌన్‌షిప్‌లోగల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం దసరా వేడుకలను వైభవంగా నిర్వహించారు. బతుకమ్మ పాటలు, దాండియా నృత్యాలను చేసి విద్యార్థులు సంబురాలు జరుపుకున్నారు. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలకు ఘనచరిత్ర ఉందన్నారు.